శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



కీసరగుట్టలో షష్ఠి సందర్భంగా శ్రీ వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం



కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి సన్నిధిలో కార్తీకమాసం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా గురువారం షష్ఠి సందర్భంగా శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డిలు ఫౌండర్ ట్రస్టీలు తదితరులు పాల్గొన్నారు.

వీబీఐటీ ఖోఖో క్రీడాకారులకు అభినందనలు



ఖోఖో క్రీడాకారులను అభినందిస్తున్న చైర్మన్ గౌతంరావు

ఘట్‌కేసర్: అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల(వీబీఐటీ) ఖోఖో క్రీడాకారులను ఆ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్.గౌతంరావు గురువారం అభినందించారు. ఇటీవల వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన స్టేట్ లెవల్ ఖోఖో పురుషుల టోర్నీలో వీబీఐటీ క్రీడాకారులు ద్వితీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ నీలిమ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సహాయ పీడీలు వెంకటేశ్, పాష, శివలాల్ పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేయొద్దు



ఘట్‌కేసర్ బస్తీ దవాఖానాలో వివరాలు తెలుసుకుంటున్న పావనీజంగయ్య

ఘట్‌కేసర్: చెత్తను రోడ్లపై వేయకుండా తడి, పొడి చెత్తగా వేరు చేసి చెత్తను సేకరించే వాహనంలోనే వేయాలని చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని 16వ వార్డులో చైర్‌పర్సన్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తను సేకరించే వాహనానికి ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరంలేదని, వార్డు ప్రజలు తరపున వాహనానికి అయ్యే వ్యయం తామే చెల్లిస్తామన్నారు. వార్డులోని బస్తీ దవాఖానాను సందర్శించారు. షుగర్ టెస్ట్‌కు అవసరమైన పరికరాలను ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకొని ఉచితంగా వైద్యం, మందులు పొందాలన్నారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, పాషా, లత, లక్ష్మీ, కేస్కర్, విజయ్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ధ్వంసం.. నలుగురి రిమాండ్



జీడిమెట్ల: గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నలుగురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గురువారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, బాలానగర్ ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌తో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. 191 కాలనీ ప్రగతినగర్‌కు చెందిన కొప్పిడి నవీన్, వరలక్ష్మి నరసింహ, తన్నీరు బ్రహ్మయ్య, కూరల ప్రవీణ్ మద్యం మత్తులో ఈనెల 4న అర్ధరాత్రి లేక్‌వ్యూ కాలనీ ప్రగతినగర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఇది గమనించిన జెక్కా మధుసూధన్‌రెడ్డి అనే వ్యక్తి అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. అనంతరం వారిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసులో నిందితులను పట్టుకున్న బాచుపల్లి, బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులను డీసీపీ అభినందించారు.

లోటుపాట్ల సవరణకు ఎలక్షన్ కమిషన్ చర్యలు

జిల్లా ఎన్నికల పరిశీలకుడు రహమ్మత్ అలీ



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యతనిచ్చే దిశగా స్వచ్ఛమైన, పవిత్రమైన ఎన్నికలను నిర్వహించేందుకు జాతీయ ఎలక్షన్ కమిషన్ గత అనుభవాలతో ఎప్పటికప్పుడు నూతన మార్గదర్శకాలను రూపొందిస్తోందని మేడ్చల్ జిల్లా ఎన్నికల పరిశీలకుడు రహ్మత్ అలీ అన్నారు. గురువారం కలెక్టరేట్ వీసీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను, చిన్న, చిన్న అంశాలను కూడా దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో స్వచ్ఛమైన, పవిత్రమైన ఎన్నికలను నిర్వహించేందుకు జాతీయ ఎన్నికల కమిషన్ అవసరమైన మార్గదర్శకాలను రూపొందిస్తూ ఎప్పటికప్పుడు సవరిస్తూ ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఎన్నికల పరిశీలకుడు అలీ అన్నారు. జిల్లాలో 2,435 పోలింగ్ బూత్‌లు ఉన్నప్పటికీ ఓటింగ్ శాతం తక్కువగా ఉందని, దీన్ని పెంచాలన్నారు. జిల్లా యంత్రాంగంతోపాటు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో కృషి చేస్తే తప్పకుండా ఓటింగ్ శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. ఓటరు ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను తీవ్రంగా పరిగణించి సవరణలు, డెత్ కేసులను ఎప్పటికప్పుడు సవరించేలా సంబంధిత ఫారాలైన 6, 6ఎ, 7ఎ, 8లలో నమోదు చేసుకునేలా బీఎల్‌ఎలు, బీఎల్‌వోలు ప్రజలకు తెలియజేసి ఓటరు జాబితాను అప్‌డేట్ చేయాలన్నారు. సవరణ జాబితాలో పెండింగ్‌లో ఉన్న 6,642 నమోదులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. ఈ ఆర్‌ఓలు, పార్టీ ప్రతినిధులు, బీఎల్‌ఓలు, బీఎల్ఎలు బూతు, గ్రామీణ, మండల స్థాయిల్లో క్రమం తప్పకుండా సమావేశాలను ఏర్పాటు చేసి ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలన్నారు. మహిళా ఓటర్ల శాతాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల ప్రతినిధులు వారి వారి సలహాలను, సూచనలను ఇవ్వాలని పరిశీలకులు కోరారు.

ఓటుహక్కు నమోదులో సమస్యలు

జిల్లా కలెక్టరు గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలోని 60 శాతం ప్రాంతాలు జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్నాయని, గ్రామీణ స్థాయిలో ఓటింగ్ శాతం తగ్గుతోందన్నారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలోని సమస్యను ఎలక్షన్ కమిషన్ వారు మాత్రమే సవరించగలరని తెలిపారు. జాబితాలో సవరణలను సకాలంలో పూర్తి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేవారికి సాఫ్ట్‌వేర్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, చాలా సమయం కేటాయించినప్పటికీ రిజిస్ట్రేషన్ కావడం లేదని తెలిపారు. బీఎల్‌ఓల రెమ్యూనరేషన్ పెంచాలని సూచించారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఓటు హక్కు నమోదు ప్రక్రియలో చాలా సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకుపోవాలని పరిశీలకులను కోరారు.

విద్యార్థి అదృశ్యం



మేడ్చల్ రూరల్: పాఠశాలకని వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. మేడ్చల్ ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లిలోని కృషి హోం అనాథ ఆశ్రమానికి రెండు నెలల క్రితం కె.అరవింద్(15) అనే విద్యార్థి వచ్చాడు. అతడు కృషి హోంలో ఉంటూ గౌడవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. గత నెల 26న ఉదయం పాఠశాలకని ఆశ్రమం నుంచి వెళ్లిన అరవింద్ తిరిగి రాలేదు. చుట్టుపక్కలా, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కృషి హోమ్ నిర్వాహకులు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

ఘట్‌కేసర్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఘట్‌కేసర్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న 50 కిలోల రేషన్ బియ్యాన్ని సబ్ ఇన్‌స్పెక్టర్ నరసింహ పట్టుకున్నారు. నిందితుడు యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం మల్కాపురం జయ తండాకు చెందిన భూక్యా నరసింహ అని తేలింది. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా మండలంలోని పలు గ్రామాల్లో బియ్యం కొనుగోలు చేసి కోళ్ల పెంపకందారులు వెంకటేశ్, సుదర్శన్‌రెడ్డిలకు కిలో 10-15 రూపాయల చొప్పున విక్రయిస్తున్నట్లు తేలింది. నిందితుడి వద్ద నుంచి బియ్యం స్వాధీనం చేసుకొని అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సదర్ ఉత్సవాలు



కీసరలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాలు

కీసర: కీసరలో మంగళవారంరాత్రి కీసర యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులు దున్నలను సుందరంగా అలకరించి గ్రామంలో ఊరేగించారు. అనంతరం కీసర చౌరస్తాలో దున్నలతో విన్యాసాలు చేయించి సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

నాచారంలో ఎమ్మెల్యే పర్యటన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌తో కలిసి గురువారం పర్యటించారు. పొంగిపొర్లుతున్న డ్రైనేజీలను పరిశీలించిన ఆయన వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. జలమండలి డీజీఎం సతీష్, అధికారులు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన పనులు పూర్తి చేయించాలని వినతి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని రోడ్లు, భవనాల శాఖ ఎస్‌ఈ కార్యాలయంలో వెంకటేశ్వర్‌రావుకు స్థానికుడు సిరాజ్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఈ స్పందించి పనుల అలసత్వానికి గల కారణాలు తెలుసుకొని తొందరగా జరిగే విధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు.

అనాథాశ్రమంలో అనారోగ్యంతో వృద్ధుడి మృతి

పోచారం: చౌదరిగూడలోని లహరి అనాథాశ్రమంలో ఓ వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఘట్‌కేసర్‌లో విజయ్(78) అనే అనాథ వ్యక్తి కాలుకు గాయమవడంతో గమనించిన పోలీసులు చౌదరిగూడలోని లహరి హోమ్‌లో చేర్పించారు. సుమారు 8 నెలలుగా హోమ్‌లోనే ఉంటున్నాడు. గత పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ సంరక్షణకు చర్యలు

కుత్బుల్లాపూర్ : ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం అన్నారు. గాజులరామారంలోని సర్వే నెంబర్ 12లో గురువారం సదరు స్థలం ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విలువైన స్థలాన్ని కబ్జా కాకుండా బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల సర్వే నెంబర్ 79 లో కూడా పలుచోట్ల బోర్డులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



ప్రభుత్వ స్థలంలో బోర్డును ఏర్పాటు చేస్తున్న ఆర్ఐ

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా నేడు మండలంలోని పలు గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండదని విద్యుత్ రూరల్, అర్బన్ ఏఈలు మౌలాలి, రాంబాబు తెలిపారు. రాజ బోల్లారం సబ్ స్టేషన్ పరిధిలోని రాజబొల్లారం, రాజబోల్లారం తండాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు, అత్వెల్లి సబ్ స్టేషన్ పరిధిలో సోమారం, రేవలబావిలోని అన్ని సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

మేడ్చల్ రూరల్: రైల్వే పట్టాలపై అనుమానాస్పదస్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఈ ఘటన మేడ్చల్ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మేడ్చల్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు స్టేషన్‌మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. అతడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా, మృతుడు రైలు నుంచి జారిపడి మరణించాడా, లేదంటే ఆత్మహత్యకు పాల్పడ్డాడా, మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణాల్లో రైల్వేపోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

అరోరాలో యూనివర్సిటీలో హెల్త్‌క్యాంప్



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీలత

మేడిపల్లి: అరోరా యూనివర్సిటీలో సాయి సంతోషి చారిటబుల్ ట్రస్ట్, యూనివర్సిటీ ఎంగేజ్‌మెంట్‌సెల్ సంయుక్తంగా గురువారం ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. గురువారం విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం దంత, కంటి, వినికిడి పరీక్షలను నిర్వహించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ... రోజువారి జీవితంలో తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించకపోవడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కన్వీనర్ చంద్రశేఖర్, డాక్టర్ రాకేష్ చంద్ర, డాక్టర్ గాయత్రీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు

రామంతాపూర్: శ్రీనగర్ కాలనీ అంతర్గత ప్రధాన రహదారిపై జలమండలి అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పైపులైన్ పనుల నిమిత్తం జలమండలి సిబ్బంది రోడ్డును తవ్వి వదిలేశారు. దీంతో గురువారం స్థానిక ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ సభ్యులు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఈ రోడ్డుపై రోజుకు కొన్ని వేల వాహనాలు వస్తుంటాయని, ఈ సమస్య అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించడం లేదని వారు వాపోయారు. పనులు పూర్తి చేయకపోతే జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ప్రజావాణి ప్రతినిధులు ఎర్రం శ్రీనివాస్, సత్యనారాయణ, వినోద్, అనిల్, మాధవ, శ్రీను, చంద్రకాంత్, గోపాల్, రామకృష్ణ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మచెరువు కంపు కంపు!

- కాలనీలవాసులు సతమతం
- గుట్టలుగా పేరుకుపోతున్న చెత్తాచెదారాలు



తుమ్మ చెరువులో ప్రజలు వేసిన చెత్త

మేడ్చల్: మేడ్చల్ పట్టణ సమీపంలోని తుమ్మచెరువు దుర్గంధభరితంగా మారింది. వ్యర్థాలు, చెత్తను ఇష్టానుసారంగా పడేస్తుండటంతో తుమ్మ చెరువు కంపుకొడుతోంది. ఆర్టీసీ కాలనీ, వినాయక్ నగర్ కాలనీ, ఎగువన ఉన్న సూర్యనగర్, మల్లికార్జుననగర్, రైల్వేస్టేషన్ కాలనీలు, మరో వైపు సాయిబాబా గుడి కాలనీలు, ఇంకోవైపు ఇందిరానగర్ తదితర కాలనీల భూగర్భజలాలకు తుమ్మచెరువు ప్రధాన ఆధారం. కాలనీల మధ్య ఉండటంతో అధికారులు ఎన్ని ఆదేశాలు జారీ చేస్తున్నా, ఎన్నిసార్లు శుభ్రం చేస్తున్నా కాలనీల వాసులు తమ ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను, చెత్తను తీసుకవచ్చి చెరువు అంచులలో పడేస్తున్నారు. చెత్త చెరువు అంచులలో నుంచి నీటిలోకి చేరి నిల్వ ఉండటంతో దుర్గంధభరితంగా మారుతోంది. దీంతో అందులో దోమలు తిష్ట వేస్తున్నాయి. సమీప కాలనీల్లో దోమల బెడద ఎక్కువైంది. ఒకవైపు నుంచి చెత్తాచెదారం వేయడం, మరోవైపు నుంచి మురుగునీరు తుమ్మ చెరువులోకి వదిలేయడంతో చెరువులో నీరు పూర్తిగా రంగు మారింది.



రంగు మారిన తుమ్మ చెరువు నీరు

కలుషితమవుతున్న భూగర్భ జలాలు..

పది కాలనీల వరకు భూగర్భ జలాలు అందించే తుమ్మచెరువు మురుగునీటితో కలుషితం అవుతుండటంతో భూగర్భజలాలు క్రమేపి కలుషితమవుతున్నాయి. చెరువు సమీపంలో ఉన్న బోర్లలో ఇప్పటికే నీరు రంగు మారి వస్తున్నాయి. చెరువును కలుషితం బారి నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు. కాలనీలకు సమీపంలో తుమ్మచెరువు ఉండటంతో కట్టపై కొంతమంది తాగుబోతులు అడ్డాగా చేసుకుని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు.

హెచ్చరికలను పట్టించుకోరు..

కట్టపై, చెరువులో చెత్త వేయవద్దని వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా వాటిని ఎవరూ ఖాతరు చేయడంలేదు. అధికారులు బాధ్యత లేకుండా చెత్త వేస్తున్నవారిపై కొరఢా ఝుళిపించాల్సిన అవసర ఎంతైనా ఉండటంతోపాటు చెరువులోకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎవరూ చెత్త వేయకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, చెత్తవేసేవారిపై జరిమానాలు విధించాలని స్థానికులు సూచిస్తున్నారు. చెరువు కట్టపై కాసేపు ప్రజలు ఉల్లాసంగా గడిపేందుకు కట్టకు ఇరువైపులా ఫ్లాట్ ఫారాలు నిర్మించి కూర్చునే విధంగా బల్లలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కట్టమైసమ్మ గుడి నుంచి కట్ట చివరి వరకు అభివృద్ధి చేస్తే అందరికీ ఎంతో ఉపయోగపడుతుంది.

మౌలిక వసతుల కల్పనకు కృషి



డ్రైనేజీ పనుల శంకుస్థాపనలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో గురువారం 21, 22 డివిజన్లలో రూ. 56లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశలవారీగా అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు తగిన ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పనులను త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు భూక్యా సుమన్‌నాయక్, మహేశ్వరి కృపాసాగర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ - బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.